క్లుప్తంగా

పూర్వ విద్యార్థికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

చొప్పదండి: పట్టణంలోని తొగరిమామిడికుంటకు చెందిన స్వామి అనే వ్యక్తి అనారోగ్యానికి గురి కాగా, నిరుపేద కావడంతో పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. స్వామి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రెండు దశాబ్దాల క్రితం పదోతరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమై రూ.56,362 జమ చేసి స్వామికి అందించారు. పూర్వ విద్యార్థులు ఏఎంసీ మాజీ చైర్మన్ ఆరెళ్ళి చంద్రశేఖర్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ కొట్టె అశోక్, పచ్చునూరి తిరుపతి, సాంబారి శ్రీనివాస్, తాటిపెల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు



గాయపడ్డ కత్తి మల్లేశంకు చికిత్స చేస్తున్న వైద్యుడు

రామడుగు: గుండి గ్రామానికి చెందిన కత్తి మల్లేశం అనే గీత కార్మికుడు ఆదివారం సాయంత్రం ఈత చెట్టుపై నుంచి పడడంతో గాయాలపాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. చెట్టుపై అదుపు తప్పడంతో కింద పడి తలకు గాయాలైనట్లు గీత కార్మికులు చెప్పారు.

హస్తం గూటికి కార్పొరేటర్



మంత్రి పొన్నం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మల్లేశం

కరీంనగర్ కార్పొరేషన్: పోలింగ్‌కు కొన్ని గంటల ముందు బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన నగరంలోని 23వ డివిజన్ కార్పొరేటర్ అర్ష కిరణ్మయి, మాజీ కార్పొరేటర్ అర్ష మల్లేశం ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాగా నగరంలో కార్పొరేటర్లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి చేరడం కొనసాగుతూనే ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే, బల్దియాలోనూ రాజకీయ మార్పులు మొదలయ్యాయి. రాష్ట్రంలో అధికారంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా నగరపాలక సంస్థలో ఒక్క కార్పొరేటర్ కూడా లేకపోవడంతో ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఇదే సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన చాలా మంది కార్పొరేటర్లు, ముఖ్యంగా సీనియర్ కార్పొరేటర్లు కాంగ్రెస్ వైపు దృష్టి సారించారు. లోకసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు బలం కావాల్సిన సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో చేరికలు ఊపందుకున్నాయి. ఇప్పటికే 11 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. మరో ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కమలం గూటికి వెళ్లారు. తాజాగా మరో కార్పొరేటర్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ బలం 12కు పెరిగిపోయింది. ఇదిలాఉంటే లోకసభ ఎన్నికల అనంతరం మరికొంతమంది కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, వైద్యుల అంజన్ కుమార్, గంట శ్రీనివాస్ పాల్గొన్నారు.అలాగే నగరానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ప్రముఖ న్యాయవాది బల్మూరి మహేందర్‌రావు మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

మహిళా వాకర్స్‌కు సన్మానం



కరీంనగర్: మదర్స్ డే సందర్భంగా సప్తగిరి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడప కొటేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా వాకర్స్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కోటేశ్‌కుమార్ మాట్లాడుతూ అమ్మ లేనిదే జన్మ లేదు.. అమ్మ త్యాగాన్ని తలవని రోజు లేదు.. ప్రతీపనిలో అమ్మ బాధ్యత చాలా గొప్పగా పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు రమేశ్, శరత్, నాగరాజమ్, మక్బూల్ హుస్సేన్, శ్రీనివాస్, శ్రీధర్, సత్యం, లక్ష్మీనారాయణ, సత్తయ్య, శంకరయ్య, ప్రకాష్‌రెడ్డి, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పార్లమెంట్ ఎన్నికల పోలింగ్

హుజూరాబాద్: హుజూరాబాద్ నియోజకవర్గంలో సోమవారం జరిగే పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్లకు ఆదివారం సాయంత్రం ఈవీఎంలతో సిబ్బంది చేరుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 305 పోలింగ్ స్టేషన్లుండగా, ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఏపీవో, ఇద్దరు ఓపీవోలు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. మొత్తం నియోజకవర్గంలో 1,525 మంది సిబ్బంది ఎన్నికల కోసం విధులు నిర్వహిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రమేశ్‌బాబు తెలిపారు. నియోజకవర్గాన్ని 30 సెక్టోరల్ విభజించి 30 సెక్టోరల్ ఆఫీసర్లను నియమించినట్లు చెప్పారు. 15 మంది రూట్ ఆఫీసర్లుండగా, ముగ్గురు ఈసీఐఎల్ టెక్నీషియన్లు, 14 మంది ఏఎల్ఎంటీఎస్‌లున్నారు. వీరికి తోడు ఐదు మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సీడీపీవో, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది నిరంతరం విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 550 మంది పోలీసు సిబ్బందిని శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ నియమించినట్లు చెప్పారు. పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన అధికారులు వారికి కేటాయించిన ఈవీఎం బాక్సులతోపాటు ఇతర సామగ్రిని పాఠశాల బస్సుల్లో తీసుకొని ఆదివారం సాయంత్రమే ఆయా పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారని తెలిపారు. ఉదయం నుంచే పోలింగ్ జరగడానికి అన్ని ఏర్పాట్లను ప్రొసీడింగ్ ఆఫీసర్ చూస్తారని వివరించారు.



హుజూరాబాద్‌లోని జూనియర్ కళాశాలలో పోలింగ్ సామగ్రి సరిచూసుకుంటున్న సిబ్బంది



రేకొండకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది



కేశవపట్నంలో మహిళా పోలింగ్ స్టేషన్

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాలకు ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో సిబ్బంది ఈవీఎంలు చేతబట్టి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. చిగురుమామిడి మండలాన్ని 4 సెక్టార్లుగా విభజించారు. ఒక్కో సెక్టారుకు ఒక మండలస్థాయి అధికారిని ఏర్పాటు చేశారు. దాదాపు 160 మంది సిబ్బంది సోమవారం జరిగే పోలింగ్‌లో పాల్గొంటున్నట్లు చిగురుమామిడి తహసీల్దార్ ఇ.నరేందర్ తెలిపారు.

శంకరపట్నం: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక మహిళా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం జరిగే ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌లలో బీఎల్‌వోలు అన్ని ఏర్పాట్లను చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా కొన్ని కేంద్రాల్లో చల్లని నీరు, కూలర్లను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్, మండల పరిధి, మండలంలోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో సిబ్బంది ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. ఓటర్లకు అన్ని సౌకర్యాలు సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరిపేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు టౌన్ సీఐ రవి తెలిపారు.

గన్నేరువరం: సోమవారం జరిగే పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తహసీల్దార్ భిక్షపతి తెలిపారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో మొత్తం 18,083 మంది ఓటర్లల్లో పురుషులు 8,842, మహిళలు 9,241 మంది ఉండగా.. వీరికి 29 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సందర్భంగా మండలంలో ఇప్పటివరకు పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు 114 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు.



ఖాదర్‌గూడెం 51వ పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లు చేసుకుంటున్న సిబ్బంది



మానకొండూర్: పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

ఏర్పాట్లు పూర్తి..

మానకొండూర్: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఎన్నికల అధికారులు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మానకొండూర్ నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్నికల అధికారులు సిబ్బందికి నిర్వహణ గురించి అవగాహన కల్పించి సామగ్రిని అందజేశారు. ఆదివారం ఎన్నికల సిబ్బంది ఎన్నికల సామగ్రితో ప్రత్యేక వాహనాల్లో గ్రామాల్లోకి చేరుకొని ఆదివారం సాయంత్రం వరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. నియోజకవర్గంలో మండలానికి ఒకటి చొప్పున మోడల్ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. మోడల్ పోలింగ్ స్టేషన్‌ను అందంగా తీర్చిదిద్దారు. నియోజకవర్గవ్యాప్తంగా 2,25,386 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం 5 గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభం కాగా.. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.



జమ్మికుంట: ఎన్నికల సామగ్రితో అధికారులు, సిబ్బంది

నిర్భయంగా ఓటేయాలి

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా, శాంతియుత వాతావరణంలో వినియోగించుకోవాలని ఎన్నికల బందోబస్తు ఇన్‌చార్జి సీఐ బిల్లా కోటేశ్వర్ కోరారు. ఆదివారం ఆయన ఇందుర్తి, చిగురుమామిడి, నవాబుపేట్, బొమ్మనపల్లి, రేకొండ, పలు గ్రామాల్లో 40 పోలింగ్ బూత్‌లను చిగురుమామిడి ఎస్సై బి.రాజేశ్‌తో కలిసి పరిశీలించారు. మండలవ్యాప్తంగా దాదాపు 70 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల నియమావళి దృష్ట్యా గ్రామాల్లో 144వ సెక్షన్ విధించినట్లు తెలిపారు. గ్రామాల్లో గుంపులుగుంపులుగా ఉండొద్దని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో మద్యం, డబ్బును పంపిణీ చేసినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



చిగురుమామిడిలో సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ కోటేశ్వర్

దర్జాగా చెరువు మట్టి తరలింపు

ఇల్లందకుంట: కొన్నేళ్లుగా పట్టపగలే దర్జాగా చెరువులోని మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. జేసీబీ సాయంతో వందలాది ట్రిప్పులను ఇటుక బట్టీలకు, గృహావసరాలకు ఎలాంటి అనుమతి లేకుండా అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నా.. అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం కనగర్తి గ్రామానికి చెందిన కొందరు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చెరువులోని మట్టిని యథేచ్ఛగా ఇతర గ్రామాలకు ట్రిప్పుకు రూ.900 చొప్పున విక్రయిస్తున్నారని, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ బండి మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో చెరువులు, కుంటల మట్టిని రెండు సంవత్సరాలుగా అమ్ముకుంటూ అధికారులు, నాయకులకు ముడుపులు అప్పజెప్పుతూ అన్యాక్రాంతం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి సంవత్సరం ఎండాకాలం చెరువులో నీరు ఎండిపోగానే మట్టి మాఫియాకు తెరతీస్తున్నారని వాపోయారు.



మట్టిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన డీపీవో

రామడుగు: వెదిర జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాన్ని గ్రామ పంచాయతీ వారు అందంగా అలకరించడంపై అభినందించారు. ప్రతి ఒక్కరూ కేంద్రానికి వచ్చి ఓటేసేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి రమేశ్, బీఎల్‌వో అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



వెదిర పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో రవీందర్



మహిళా పోలింగ్ కేంద్రం

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో మహిళా ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పోలింగ్‌కేంద్రంలోకి వచ్చేదారిలో బెలూన్‌లతో సుందరంగా అలంకరించారు. ఇక్కడ మహిళలు మాత్రమే ఓటు వేయనుండగా.. సిబ్బంది కూడా మహిళలే ఉండనున్నారు.





ఆదిశంకరాచార్యులకు ఫలపంచామృతాభిషేకం

వైభవంగా దుర్గాభవానీ సుందరేశ్వరుల కల్యాణం

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయ సప్తమ వార్షికోత్సవాల మూడో రోజైన ఆదివారం ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి సన్నిధిలో దుర్గాభవానీ సుందరేశ్వర స్వామి వారల కల్యాణాన్ని ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని ఆదిశంకరాచార్యులకు సంపూర్ణ అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, భాష్యపారాయణం జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులు వేములవాడ ద్రోణాచారి, ముక్క ప్రభాకర్, శానగొండ మధుసూదన్, కార్పొరేటర్ వంగళ శ్రీదేవి,భక్తులు పాల్గొన్నారు.



పల్లకి సేవ



ప్రత్యేక పోలింగ్ కేంద్రం

చొప్పదండి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అధికారులు ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. పాఠశాలలోని 150వ పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వాగత తోరణం, ఓటు ఆవశ్యకతను తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేసి రెడ్ కార్పెట్ పరిచారు. పోలింగ్ సిబ్బంది సమస్యలేని ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి సందర్శించారు. హౌసింగ్ బోర్డు కాలనీ, రాంనగర్, ఆర్టీసీ వర్క్‌షాప్ ఏరియాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. డీసీ వెంట ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్ ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలి

కరీంనగర్‌సిటీ: కేంద్ర, రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని వాగేశ్వరి కళాశాల చైర్మన్ బీవీఆర్ గోపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వాగేశ్వరి డిగ్రీ-పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఎస్వీఆర్ గార్డెన్‌లో వీడ్కోలు సమావేశం బాన్ వయోజ్ పేరుతో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ రత్న గోపాల్‌రెడ్డి, హిమవాణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్స్ డాక్టర్ రోహిణి, హిమని హాజరయ్యారు. డాక్టర్ రత్న గోపాల్‌రెడ్డి, డాక్టర్ రోహిణి, హిమని మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ అవసరమన్నారు. క్రీడారంగంలో రాణించిన విద్యార్థులను, ఐటీ కంపెనీలో ఉద్యోగాలు సాధించిన వారిని, ఎన్ఎస్ఎస్‌లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్ సిగ్నేచర్ డేలో పాల్గొని గతంలో జరిగిన సన్నివేశాలను గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపాళ్లు సతీష్‌గౌడ్, లింగమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ చెన్నమల చైతన్య, ఉమెన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రమణ, ఏవో నిజాముద్దీన్, వేదవ్యాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన